సెల్ఫీ విత్ మట్టిగణేశుడు



సాక్షి పెద్దపల్లి: పర్యావరణాన్ని కాపాడేలా మట్టి గణేశుడిని ప్రతిష్ఠించారా.. ప్రత్యేక ఆకృతుల్లో అపార్ట్‌మెంట్ కమ్యూనిటీ లేదా ఇళ్లలో మట్టి గణపతులను పూజిస్తున్నారా.. అయితే మీరు పర్యావరణహిత గణేశుడితో సెల్ఫీ ఫొటో తీసుకుని సెల్ నంబరు 9700215216కు వాట్సాప్ చేయండి. మీరు పంపిన ఫొటోను 'సాక్షి' దిన పత్రికలో ప్రచురిస్తాం.

శుక్రవారం । 22 । సెప్టెంబర్ । 2023

న్యూస్‌రీల్

కవితను కలిసిన కోలేటి



కవితకు పూలమొక్క అందజేస్తున్న దామోదర్

గోదావరిఖని(రామగుండం): ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను పోలీస్‌హౌజింగ్ బోర్డు చైర్మన్ కోలేటి దామోదర్ గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. మహిళా రిజర్వేషన్ బిల్లు పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన క్రమంలో దీనికోసం పోరాటం చేసిన కవితకు పూలమొక్క అందజేసి అభినందనలు తెలిపారు.

ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుడిగా కొంకటి



లక్ష్మీనారాయణ

గోదావరిఖని(రామగుండం): రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుడిగా కొంకటి లక్ష్మీనారాయణ ను గురువారం నియమించినట్లు సీఎం కేసీఆర్ ప్రకటన విడుదల చేశారు. రామగుండం తొలి మేయర్‌గా పనిచేసిన లక్ష్మీనారాయణకు ఈ పదవి రావడంపై రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్‌తో పాటు పలువురు ప్రత్యేకంగా అభినందించారు.

ఎన్టీపీసీ డైరెక్టర్‌ను కలిసిన బాబర్ సలీంపాషా




డైరెక్టర్ దిలీప్‌కుమార్‌పటేల్‌తో సలీంపాషా

జ్యోతినగర్(రామగుండం): ఎన్టీపీసీ డైరెక్టర్ (హెచ్ఆర్) దిలీప్‌కుమార్ పటేల్‌ను ఎన్సీపీ సభ్యుడు, ఐఎన్టీయూసీ జాతీయ సీనియర్ కార్యదర్శి బాబర్ సలీంపాషా మర్యాదపూర్వకంగా కలిశారు. గురువారం న్యూఢిల్లీలోని ఎన్టీపీసీ కార్పొరేట్ సెంటర్ కార్యాలయంలో ఆయనతో సమావేశమయ్యారు. సంస్థ ఉద్యోగులకు సంబంధించిన పలు అంశాలతో పాటు ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయాలని, తెలంగాణ ప్రాజెక్టులో స్థానికులకు కాంట్రాక్టు కార్మికులుగా అవకాశం కల్పించాలని డైరెక్టర్‌ను కోరినట్లు బాబర్ తెలిపారు.

సీఎమ్మార్ పూర్తి చేయండి

పెద్దపల్లిరూరల్: జిల్లాలోని మిల్లర్లు సకాలంలో సీఎమ్మార్ రైస్ డెలివరీ పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని అడిషనల్ కలెక్టర్ శ్యాం ప్రసాద్ లాల్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో గురువారం జిల్లా పౌర సరఫరాల అధికారి కార్యాలయం, జిల్లా పౌర సరఫరాల కార్పొరేషన్ మేనేజర్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. వచ్చే వానాకాలం పంట ధాన్యం కొనుగోలుకు సంబంధించి పకడ్బందీగా ప్రణాళికలు రూపొందించాలన్నారు. ఆయన వెంట డీఎస్‌ఓ ప్రేమ్‌కుమార్, డీఎం శ్రీకాంత్ తదితరులున్నారు.

సమస్యలకు పరిష్కారం చూపాలి



ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీలు

పెద్దపల్లిరూరల్: అంగన్‌వాడీ ఉద్యోగుల న్యాయమైన సమస్యలకు సత్వరమే పరిష్కారం చూపాలంటూ గురువారం కలెక్టరేట్ ఎదుట అంగన్‌వాడీ టీచర్, ఆయాలు ఆందోళనకు దిగారు. సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వేల్పుల కుమారస్వామి, ఎర్రవెల్లి ముత్యంరావు, జ్యోతి తదితరులు ప్రభుత్వం అనుసరిస్తున్న తీరును విమర్శించారు. అంగన్వాడీ ఉద్యోగులను బీఆర్ఎస్ ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందన్నారు. సమస్యలు పరిష్కరించకుంటే వచ్చే ఎన్నికల్లో ప్రభుత్వానికి గుణపాఠం తప్పదన్నారు. నాయకులు కల్లేపల్లి అశోక్, ప్రశాంత్, వనజారాణి, కమలేశ్, సులోచన, శోభ, రామలక్ష్మి, హరిత, సుగుణబాయి, మహేశ్వరి, రాజ్యలక్ష్మి, శారద ఉన్నారు.

అక్టోబర్‌లో ఓపెన్ స్కూల్ సప్లిమెంటరీ పరీక్షలు

జ్యోతినగర్(రామగుండం): తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ఎస్సెస్సీ, ఇంటర్‌మీడియెట్ సప్లిమెంటరీ పరీక్షలు అక్టోబర్ 16 నుంచి 26 వరకు నిర్వహించనున్నట్లు ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఓపెన్ స్కూల్ కో ఆర్డినేటర్ చల్వాజి నాగేశ్వరావు ప్రకటనలో తెలిపారు. పరీక్షలు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించబడతాయని పేర్కొన్నారు. ఇంటర్‌మీడియెట్ సైన్స్, ఒకేషనల్ అభ్యర్థులకు ప్రాక్టికల్ పరీక్షలు అక్టోబర్ 30 నుంచి నవంబర్ 6 వరకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

జిల్లాకు జ్వరమొచ్చింది!

- డెంగీ, సీజనల్, విషజ్వరాల విజృంభణ
- ఇంటింటా బాధితులే.. కిటకిటలాడుతున్న ఆసుపత్రులు
- తూతూమంత్రంగా పారిశుధ్య నిర్వహణ.. దోమల స్వైరవిహారం

'ఇటీవల ధర్మారం మండలం నందిమేడారం గ్రామానికి చెందిన సిరివేని మైథిలి, మూడురోజుల క్రితం పాలకుర్తి మండలం కుక్కల గూడూరు గ్రామంలో బాలుడు బెక్కం అక్షిత్, ముత్తారం మండలం మైదబండలో ఇంటర్ విద్యార్థి ఎర్రం సంతోష్.. ఇలా పలువురు డెంగీ బారినపడి మృత్యువాతపడ్డారు. జిల్లాలో మారిన వాతావరణ పరిస్థితులు, పారిశుధ్య నిర్వాహణ లోపంతో డేంజర్ డెంగీ బెల్స్ మోగుతున్నాయి. ఇప్పటి వరకు అధికారిక లెక్కల ప్రకారం జిల్లాలో 148 డెంగీ కేసులు నమోదయ్యాయి. ఇలాంటి పరిస్థితుల్లో వైద్యారోగ్య, మున్సిపల్, పంచాయతీరాజ్ శాఖలు సమన్వయంగా పనిచేయాల్సి ఉండగా.. తూతూమంత్రంగా చర్యలు చేపడుతుండటంతో పల్లె, పట్టణం తేడా లేకుండా ఇంటికొకరు జ్వరాలతో మంచం పడుతున్నట్లు 'సాక్షి' విజిట్‌లో తేలింది.

సాక్షి గ్రౌండ్ రిపోర్ట్



'ఈచిత్రంలో ఉన్నది గోదావరిఖని ఏరియా ఆసుపత్రిలో ఓపీ కోసం నిలబడిన బాధితులు. డెంగీ, సీజనల్ వ్యాధుల బారిన పడిన వారితో కిక్కిరిసిపోతుంది. వారం రోజుల్లో 3,916 మంది రోగులు ఆసుపత్రికి రాగా, అందులో 1,378 మంది జ్వరాలతో బాధపడుతూ వచ్చినవారే. గోదావరిఖని ఏరియాలో ఇప్పటి వరకు 18 డెంగీ కేసులు నమోదయ్యాయి'.



'ఈఫొటోలోని వృద్ధుడు ముత్తారం మండలం మైదంబండకు చెందిన బియ్యాని లింగయ్య. పది రోజుల నుంచి జ్వరం వస్తుండటంతో ఆర్ఎంపీ వద్ద వైద్యం చేయించుకుంటూ.. టెస్టులు, మందులకు ఇప్పటికీ రూ.3 వేల వరకు ఖర్చు అయింది. అతడి భార్య ఓదమ్మకు సైతం జ్వరం. వృద్ధాప్యంతో ముత్తారంలోని ప్రభుత్వ ఆసుపత్రి పోలేని పరిస్థితి. ఆరోగ్య కార్యకర్తలు ఇటు వైపు రావడం లేదు. దీంతో జ్వరంతోనే ఇబ్బందులు పడుతున్నారు'.

సాక్షి, పెద్దపల్లి: జిల్లాను జ్వరాలు వణికిస్తున్నాయి. ఇంటికొకరు జ్వరం, దగ్గు లక్షణాలతో మంచం పడుతున్నారు. మరోవైపు రక్తకణాలు తగ్గి పరిస్థితి విషమంగా మారి ప్రాణాలు పోతున్నాయి. వర్షాకాలం అంటేనే వ్యాధుల కాలం. మలేరియా, డెంగీ, విషజ్వరాలు, డయేరియా (వాంతులు, విరేచనాలు) ఎక్కువగా ప్రబలే ప్రమాదముంటుంది. కలుషిత నీరు, మురుగు నీటి గుంతలు, అపరిశుభ్ర వాతావరణం వ్యాధులు ప్రబలడానికి కారణమవుతాయి. ఏటా పలువురు వ్యాధి ముదిరి మృత్యువాత పడ్డ ఘటనలు కూడా చోటు చేసుకుంటున్నా అధికారులు కంటితుడుపు చర్యలతో సరిపెడుతున్నారు. దీంతో జిల్లాసుపత్రితో పాటు గోదావరిఖని, మంథని, సుల్తానాబాద్ ఆసుపత్రుల్లో జ్వర బాధితుల ఓపీ విపరీతంగా పెరుగుతోంది.

కంటితుడుపు చర్యలే

జ్వరాల బారిన పడిన ప్రాంతాలను అధికారులు తరుచూ సందర్శించడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. పత్రికల్లో వచ్చే కథనాలను చూసి హడావుడిగా ఒక్క రోజు హెల్త్ క్యాంపులు నిర్వహించి వెళ్తున్నారని ప్రజలు వాపోతున్నారు. స్థానిక ఆసుపత్రుల్లో వైద్యులు అందుబాటులో లేకపోవడంతో వారంతా ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ఇదే అదనుగా ప్రైవేట్ ఆసుపత్రుల నిర్వాహకులు ఇష్టారాజ్యంగా దెండుకుంటున్నాయి.



పెద్దపల్లి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులు

అసౌకర్యాల ఆస్పత్రి

మంథని: మంథని సామాజిక వైద్యశాలలో అసౌకర్యాలు రాజ్యమేలుతున్నాయి. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో రోజూ 300పైగా రోగులు ఆస్పత్రికి వస్తున్నారు. ఇందులో జ్వర పీడితులే అధికంగా ఉంటున్నారు. నిత్యం 30 నుంచి 40 మంది ఇన్‌పేషంట్లుగా చేరుతున్నారు. ఆస్పత్రిలో మూడు వార్డులు ఉండగా ఒకటి ఎమర్జెన్సీకి, మరో రెండు ఐపీ పేషంట్లకు వాడుతున్నారు. మరో పది నుంచి పదహేను మందికి గదుల ముందు ఆవరణలోని వరండాల్లో సర్దుబాటు చేస్తున్నారు. వైరల్ ఫీవర్లు ఎక్కువ వస్తుండడంతో రక్త, మూత్ర పరీక్షల కోసం ఆ గది వద్ద రోగులు పడిగాపులు కాస్తున్నారు.

చుట్టపు చూపుగా వైద్యులు..

ఆస్పత్రిలో 13 మంది వైద్యులు పనిచేస్తున్నా రోజూ ఒక్కరిద్దరూ మాత్రమే విధుల్లో ఉంటున్నారు. పలు రకాల వైద్య నిపుణులు ఉన్నా వంతులవారీగా విధులు నిర్వహిస్తున్నారు. పిల్లల వైద్యులు, జనరల్ ఫిజిషియన్, సర్జన్, దంత వైద్యులు ఉన్నా రెగ్యులర్‌గా విధులకు వచ్చిన దాఖలాలు లేవు. ఆస్పత్రి సూపరింటెండెంట్, జిల్లా ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపంతో సర్కారు దవాఖానాకే జబ్బు చేసింది. ప్రజాప్రతినిధులు సైతం పట్టించుకోవడం లేదని రోగులు అంటున్నారు.



ఆస్పత్రి వరండాలో పడుకున్న రోగులు

టెస్టులు చేయించినా రిపోర్టు ఇవ్వలేదు



పది రోజుల నుంచి జ్వరం రాగా ముత్తారంలోని ప్రభుత్వ ఆసుపత్రికి మూడు రోజులు వెళ్లా. అక్కడ టెస్టు చేశారు కానీ రిపోర్ట్స్ ఇవ్వలేదు. ఎమి జ్వరమో తెలియక మళ్లీ మచ్చుపేటలోని ప్రైవేట్ ల్యాబ్‌లో టెస్ట్ చేయించుకున్నా. టెస్ట్, మందులకు రూ.4వేలు ఖర్చయ్యాయి. ఆసుపత్రిలో చేసిన టెస్టు రిపోర్ట్, మందులు ఇస్తే ఖర్చు తగ్గేది. ఇప్పటికీ జ్వరం, దగ్గు, జలుబు ఉంది. గ్రామంలో చాలామంది ఇలాగే ఇబ్బందులు పడుతున్నారు.

– ఎర్రం కిష్టయ్య, మైదంబండ, ముత్తారం

ఐదురోజుల క్రితం వచ్చాం



మా కూతురు అక్షయకు తీవ్ర జ్వరం రావడంతో ఐదు రోజుల క్రితం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువచ్చాం. పలు పరీక్షలు చేసి మందులు ఇచ్చారు. ఇంకా పూర్తిగా నయం కాలేదు. ఇక్కడ ఎవరూ సరిగ్గా పట్టించుకోవడం లేదు.

– కుటుంబ సభ్యులతో అక్షయ, పెద్దపల్లి

చర్యలు తీసుకుంటున్నాం



మారిన వాతావరణ పరిస్థితులతో జిల్లాలో వైరల్ జ్వరాలు పెరుగుతున్నాయి. జ్వరపీడితులు ఎక్కువగా ఉంటే వైద్య శిబిరాలు నిర్వహించేందుకు కార్యాచరణ సిద్ధం చేస్తున్నాం. ఇళ్ల పరిసరాలు ప్రజలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి. నీరు నిల్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. జ్వరం ఉంటే నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలి.

– ప్రమోద్‌కుమార్, జిల్లా వైద్యాధికారి

పట్టించుకుంటలేరు



జ్వరం ఎక్కువగా రావడంతో ఓదెల నుంచి జిల్లా ఆస్పత్రికి వచ్చాం. మూడు రోజులుగా ఇక్కడే ఉంటున్నా సిబ్బంది సరిగా పట్టించుకోవడం లేదు. డెంగీ వచ్చిందా, టైఫాయిడ్ ఏ జ్వరమో కూడా చెప్పడం లేదు. రేపటివరకు తగ్గకుంటే ప్రైవేట్ ఆసుపత్రికి పోతా.

– ఈశ్వర్, ఓదెల

దోమలు ముసురుతున్నాయ్



రెండు రోజులుగా బాగా జ్వరం, నీరసంగా ఉంది. ఊర్లోని కాలువల్లో దోమలు ముసురుతున్నాయి. పెద్ద ఆస్పత్రికి వస్తే అడ్మిట్ చేసుకున్నరు. ఎప్పుడు గట్ల కాలేదు నాకు.

– కనకతారా, రామగిరి.

నాలుగు రోజులైనా తగ్గలేదు



గోదావరిఖనిలోని సింగరేణి స్కూల్‌లో 10వ తరగతి చదువుతున్న. నాలుగు రోజులుగా జ్వరం తగ్గడం లేదు. నిన్న జీజీహెచ్ ఆస్పత్రిలో చూపిస్తే డెంగీ లక్షణాలు ఉన్నాయని అడ్మిట్ చేసుకున్నారు.

– టి.యశ్వంత్, సుందిళ్ల

కాళ్లులు కంపుకొడుతున్నాయి



మా ఊర్లోని ఎస్సీ కాలనీలో చాలా మందికి జ్వరాలు వస్తున్నాయి. నాకు నాలుగు రోజులుగా జ్వరం, కాళ్ల గుంజుతున్నాయి. మురికి కాలువలు కంపుకొడుతున్నాయి. మమ్మల్ని పట్టించుకునే నాథుడే లేడు.

– జి.తిరుపతి, లింగాపూర్

కాగితాల్లోనే కాంగ్రెస్ అభివృద్ధి

- మంత్రి కొప్పుల ఈశ్వర్

మంథని: కాంగ్రెస్ అభివృద్ధి కాగితాల్లో తప్ప స్థానికంగా ఏం ఉండదని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ విమర్శించారు. గురువారం మంథని ఎస్ఎల్‌బీ గార్డెన్‌లో మంథని, రామగిరి, ముత్తారం కమాన్‌పూర్ మండలాలకు చెందిన గృహలక్ష్మి లబ్ధిదారులకు జెడ్పీ చైర్మన్లు పుట్ట మధు, జక్కు శ్రీహర్షిణి, కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌తో కలిసి ప్రొసీడింగ్ కాపీలు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, తెలంగాణ రాకముందు పదేళ్లు, అంతకుముందు సుమారు 40 ఏళ్లు అధికారంలో ఉన్న కాంగ్రెస్ ఏనాడు ప్రజలకు మేలు చేయాలని ఆలోచన చేయలేదన్నారు. సీఎం కేసీఆర్, సంక్షేమ పథకాలు దేశంలోనే పేరు సంపాదించుకున్నాయని వివరించారు. గృహలక్ష్మి ద్వారా జిల్లాలో 25వేల ఇళ్లు మంజూరు చేస్తూ రూ.250 కోట్లు కేటాయించడం జరిగిందన్నారు. మంథని నియోజకవర్గానికి 1,500 ఇళ్లకు రూ.40కోట్లు వెచ్చించినట్లు తెలిపారు. ప్రభుత్వ ఫలాలు ప్రతి ఇంటికి చేరుతున్నాయని వెల్లడించారు. జిల్లాలో ఇప్పటికే 8 వేల ఇళ్లకు ప్రొసీడింగ్‌లు అందించామని, మరో నెలరోజుల్లో 25 వేలు పూర్తి చేస్తామని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ పేర్కొన్నారు.



లబ్ధిదారుకు ప్రొసీడింగ్ కాపీ ఇస్తున్న మంత్రి ఈశ్వర్ పక్కన జెడ్పీ చైర్మన్ మధు, కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

మహనీయుల చరిత్ర తెలిసేలా విగ్రహాలు

స్వాతంత్ర్య ఉద్యమం, సమాజహితం కోసం పోరాటాలు చేసిన మహనీయుల విగ్రహాలను మంథనిలో ఏర్పాటు చేయడం అభినందనీయమని మంత్రి ఈశ్వర్ అన్నారు. మంథని బొక్కలవాగుపై (కూచిరాజ్‌పల్లి–బోయిన్‌పేట నుంచి మంథని) రూ. 6 కోట్లతో చేపట్టే వంతెనకు గురువారం శంకుస్థాపన చేశారు. బొక్కలవాగుపై రోడ్డు, లైటింగ్, మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ పై అంతస్తులో నిర్మాణ పనులు ప్రారంభించారు. అలాగే మంథని మొదటి ఎమ్మెల్యే గులుకోట శ్రీరాములు, కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహాలను ఆవిష్కరించారు. కార్యక్రమాల్లో మంథని మున్సిపల్ చైర్‌పర్సన్ పుట్ట శైలజ, అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరికలు

ధర్మారం(ధర్మపురి): ధర్మారం మండలం కమ్మరిఖాన్‌పేట గ్రామానికి చెందిన వివిధ పార్టీల మహిళలు గురువారం మంత్రి ఈశ్వర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో రైతుబంధు సమితి కోఆర్డినేటర్ పెట్టెం అంజయ్య, సీనియర్ నాయకులు మెంగాని అంజయ్య, గుజ్జుల మహేందర్‌రెడ్డి, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను నమ్మితే గోసపడుతాం



ప్రజా అంకిత యాత్రలో ఎమ్మెల్యే చందర్, నాయకులు

పాలకుర్తి(రామగుండం): రాబోయే ఎ న్నికల్లో ఆ పార్టీని నమ్మితే మోసపోయి అరిగోసపడుతామని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. గురువారం మండలంలోని కుక్కలగూడూర్‌లో ప్రజా అంకితయాత్ర నిర్వహించారు. గ్రామంలో ఇంటింటా తిరుగుతూ ప్రభుత్వ పథకాల గూర్చి వివరిస్తూ స్థానికుల సమస్యలు తెలుసుకున్నారు. నియోజకవర్గంలో సాగునీరు అందించేందుకు రూ.90కోట్లతో చేపట్టిన లిఫ్ట్ ఇరిగేషన్ పనులు తుదిదశకు చేరుకున్నాయని, త్వరలోనే కుక్కలగూడుర్ శివారులోని బండలవాగు ప్రాజెక్టును ఎల్లంపల్లి నీటితో నింపుతామన్నారు. గ్రామంలో తాగునీటి సౌకర్యార్థం రూ.5లక్షలు, పద్మశాలీ భవన నిర్మాణానికి రూ.5లక్షలు కేటాయించినట్లు వెల్లడించారు. కార్మికసంఘం నాయకుడు కౌశికహరి, వైస్ ఎంపీపీ ఎర్రం స్వామి, ప్రజాప్రతినిధులు గోండ్ర చందర్, కోల లత, దుర్గం జగన్, వేణుగోపాలరావు, పల్లె అశోక్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

గురుకులాల్లో స్పాట్ అడ్మిషన్లు

పెద్దపల్లిరూరల్: సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో ఖాళీ సీట్ల భర్తీకి ఈనెల 23న శనివారం స్పాట్ అడ్మిషన్ తీసుకుంటామని జిల్లా సమన్వయాధికారి మంజుల తెలిపారు. గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో ప్రస్తుత విద్యా సంవత్సరానికి ఎస్సీ బాలబాలికలకు 5 నుంచి 9వ తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్ల భరీ చేసేందుకు స్పాట్ అడ్మిషన్స్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రవేశ పరీక్ష రాసి సీటు వచ్చినా ప్రవేశం పొందనివారు, ఎస్సీ అనాథ, సెమీ అనాథ, దివ్యాంగులతో పాటు సీటు రానివారికి ప్రాధాన్యత ఇవ్వబడుతుందని వివరించారు. ఎస్సీ బాలబాలికలు మాత్రమే హాజరు కావాలని పేర్కొన్నారు.


పదోన్నతి కోసం ఆప్షన్ నమోదు చేయాలి

పెద్దపల్లిరూరల్: పదోన్నతి కోసం స్కూల్ అసిస్టెంట్ ఆప్షన్ నమోదు చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి మాధవి పేర్కొన్నారు. జిల్లాలోని స్కూల్ అసిస్టెంట్ క్యాడర్‌కు సంబంధించిన ఉపాధ్యాయులు ప్రధానోపాధ్యాయులుగా ప్రమోషన్‌కోసం కోసం ఆప్షన్ నమోదు చేసుకోవాలని సూచించారు. స్కూల్ అసిస్టెంట్ వెబ్ ఆప్షన్స్ సంబంధిత పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని, ఈనెల 23 వరకు వెబ్ ఆప్షన్స్ ఎడిట్ చేసుకోవచ్చన్నారు.

జయహో మహిళ..

సాక్షి, పెద్దపల్లి: మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదంతో రాజకీయాల్లో సైతం అవకాశాలను అందిపుచ్చుకొని రాణిస్తామంటున్నారు జిల్లా మహిళాలోకం. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు ఉద్దేశించిన 'నారీ శక్తి వందన్ అధినియం' బిల్లు–2023 ఉభయ సభల్లో ఆమోదం పొందటంతో మహిళలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వారి మాటల్లో..


అవగాహన పెంచాలి



మహిళ రిజర్వేషన్ బిల్లుతో మహిళలు వివిధ రంగాల్లో రాణించినట్లే రాజకీయాల్లో సైతం రాణించేందుకు అవకాశం కల్పించినట్లు అవుతుంది. ఎన్నో ఏళ్ల నుంచి పెండింగ్ బిల్లు ఈరోజు ఆమోదం పొందడం అనందంగా ఉంది. దీనిపై పెద్ద ఎత్తున మహిళలకు అవగాహన కల్పించాల్సి అవసరం ఉంది. అప్పుడే చట్టసభల్లో మహిళల సంఖ్య పెరుగుతుంది.

– పుట్ట శైలజ, మంథని మున్సిపల్ చైర్‌పర్సన్


చట్టసభల్లో ప్రాధాన్యత



పురుషులతో సమానంగా మహిళలకు సముచిత స్థానం కల్పించేందుకు ప్రధాని మోదీ 33 శాతం మహిళ రిజర్వేషన్ బిల్లును పార్లమెంట్‌లో ఆమోదించినందుకు హర్షం వ్యక్తం చేస్తున్నా. మహిళా రిజర్వేషన్‌తో భవిష్యత్ రాజకీయాల్లో విద్యావంతులు చట్టసభల్లో కొలువుదీరనుండడంతో దేశం మరింత ప్రగతి సాధించేందుకు అవకాశం ఉంది.

– సోమారపు లావణ్య, బీజేపీ మహిళా మోర్చా కార్యవర్గ సభ్యురాలు

టికెట్స్ కేటాయించాలి



మహిళ రిజర్వేషన్ బిల్లుకు దేశంలోని అన్ని పార్టీలు మద్దతు ప్రకటించడం సంతోషకరం. చిత్తశుద్ధి ఉంటే బిల్లు అమలుతో సంబంధం లేకుండా ఈసారి జరిగే ఎన్నికల్లో మహిళలకు అన్ని పార్టీలు టికెట్స్ కేటాయించాలి. అలాగే బిల్లులో బీసీ మహిళలకు కోటా కేటాయిస్తే బాగుంటుంది. జనాభా దామాషా ప్రకారం 50శాతం రిజర్వేషన్లు కల్పిస్తే బాగుండేది.

– దాసరి ఉష, బీఎస్పీ పెద్దపల్లి ఇన్‌చార్జి

శుభపరిణామం



ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉంటున్న మహిళ రిజర్వేషన్ బిల్లు ఉభయ సభల్లో ఆమోదం పొందడం శుభపరిణామం. దీంతో చట్టసభల్లో మహిళ ప్రజాప్రతినిధులకు అవకాశాలు పెరుగుతాయి. విద్య, ఉద్యోగ రంగాల్లో రాణించినట్లే ఉన్నత విద్యను అభ్యసించిన మహిళలు రాజకీయాల్లోకి ప్రవేశించి దేశభవిష్యత్‌ను మార్చేందుకు అవకాశం ఉంది.

– దాసరి మమతారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్, పెద్దపల్లి

బీసీలకు వాటా ఉండాలి



మహిళా రిజర్వేషన్ బిల్లులో తప్పనిసరిగా ఓబీసీ మహిళల రిజర్వేషన్ ఉండాలి. అయితే డీ లిమిటేషన్ తర్వాత అమలు చేయడం కంటే ప్రస్తుత ఎన్నికల నుంచే అమలు చేస్తే బాగుండేది. మహిళలు ఇంకా ఎన్ని రోజులు రాజకీయాల్లో అవకాశాల కోసం ఎదురుచూడాలి.

– ముత్యం సునీత, మున్సిపల్ చైర్‌పర్సన్, సుల్తానాబాద్

క్లుప్తంగా

రష్మీఠాకూర్‌కు వరల్డ్ మీట్ అవార్డు



అవార్డు అందుకుంటున్న రష్మీ ఠాకూర్

జ్యోతినగర్(రామగుండం): రామగుండం ప్రాంతానికి చెందిన రష్మీ ఠాకూర్‌కు వరల్డ్ మీట్–2023 అవార్డు సొంతం చేసుకుంది. ఈనెల 20న థాయ్‌లాండ్‌లో వరల్డ్ మార్షల్ ఆర్టిస్టు కౌన్సిల్ ఆధ్వర్యంలో థాయ్‌లాండ్ ప్రభుత్వ డిఫెన్స్ మినిస్టర్ సుతిన్ క్లుంగ్‌సంగ్, టూరిజం, స్పోర్ట్స్ మంత్రి సుడాన్‌చేతుల మీదుగా అవార్డును అందుకుంది.

శ్రీధర్‌కు భారత్ ఐకాన్..



శ్రీధర్

గోదావరిఖనిటౌన్(రామగుండం): వెలుగు సామాజిక స్వచ్ఛంద సంస్థ ద్వారా సురభి శ్రీధర్ చేస్తున్న సామాజిక సేవలకు అవార్డు వరించింది. స్ఫూర్తి సర్వీస్ సొసైటీ ఇండియా ఎన్జీవో, పీస్ ఆఫ్ ఇండియా, స్ఫూర్తి ఇంటర్నేషనల్ వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ఆధ్వర్యంలో అక్టోబర్ 3న హైదరాబాద్ బొగ్గులకుంటలోని తెలంగాణ సరస్వతి పరిషత్ ఆడిటోరియంలో ఇంటర్నేషనల్ హానరీ–2023 భారత్ ఐకాన్ అవార్డును శ్రీధర్‌కు అందజేయనున్నట్లు స్ఫూర్తి సర్వీస్ సొసైటీ చైర్మన్ ఆకుల రమేశ్ తెలిపారు.

తిరుపతిగౌడ్‌కు ఆచార్యదేవోభవ..



అవార్డు స్వీకరిస్తున్న తిరుపతిగౌడ్

జ్యోతినగర్(రామగుండం): విశ్వ భారతి విద్యా సంస్థల్లో సుదీర్ఘకాలం పాటు ఉపాధ్యాయుడిగా, ఇన్‌చార్జిగా, హెడ్మాస్టర్‌గా విధులు నిర్వహిస్తున్న బందారపు తిరుపతిగౌడ్ సేవలను గుర్తిస్తూ సెమ్స్ నేషనల్ ఒలింపియాడ్ ఆర్గనైజేషన్ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుతో పాటు ఆచార్య దేవోభవగా గుర్తించి పురస్కారం అందించారు. గురువారం అన్నపూర్ణ కాలనీలో తిరుపతిగౌడ్‌ను విద్యాసంస్థ చైర్మన్ యాదగిరిగౌడ్ సన్మానించారు.

అంబేద్కర్ నేషనల్ అవార్డుకు రాజారత్నం



ఆహ్వాన పత్రం అందిస్తున్న రాధాకృష్ణ

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): బహుజన సాహిత్య అకాడమీ నేషనల్ కమిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో అందిస్తున్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ నేషనల్ అవార్డుకు కందుకూరి రాజారత్నం ఎంపికై నట్లు జాతీయ అవార్డు సెలక్షన్ కమిటీ చైర్మన్ నల్ల రాధాకృష్ణ తెలిపారు. గురువారం హైదరాబాద్‌లోని బహుజన సాహిత్య అకాడమీ జాతీయ కార్యాలయంలో ఆహ్వానపత్రం అందజేశారు.కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎంఎం గౌతమ్, కార్యదర్శి విజయ్‌కుమార్, అవార్డు సెలక్షన్ కమిటీ సభ్యుడు రాజలింగం పాల్గొన్నారు.

అక్కినేని పాన్ ఇండియా అవార్డు అందుకున్న రాజేశ్



అవార్డు అందుకుంటున్న రాజేశ్

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): యైటింక్లయిన్‌కాలనీకి చెందిన తెలంగాణ నాగార్జున అభిమాన సంఘాల రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గుండేటి రాజేశ్ అక్కినేని పాన్ ఇండియా అవార్డు స్వీకరించారు. 30 ఏళ్ల నుంచి అక్కినేని అభిమాన సంఘాల ఆధ్వర్యంలో రాజేశ్ చేస్తున్న సేవలను గుర్తించి ఈనెల 20న హైదరాబాద్‌లో అక్కినేని శతజయంతి వేడుకల సందర్భంగా అవార్డును సినీ దర్శకుడు వైవీఎస్ చౌదరి, అక్కినేని నాగసుశీల, సినీ ప్రముఖుల చేతుల మీదుగా అవార్డు స్వీకరించారు.

ఎక్స్‌ప్రెస్ రైళ్ల రద్దుతో ప్రయాణికుల ఇక్కట్లు

రామగుండం: రైల్వే ట్రాక్ పునరుద్ధరణ పనుల నేపథ్యంలో గురువారం రామగుండం మీదుగా నడిచే పలు సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను రద్దు చేయగా, మరికొన్నింటిని దారి మళ్లించినట్లు రైల్వే అధికారులు స్టేషన్‌లో నోటీస్ బోర్డులో ప్రకటించారు. కాగా ఎక్స్‌ప్రెస్ రైళ్ల రద్దుతో అప్పటికే రిజర్వేషన్ చేసుకున్న ప్రయాణికులు తీవ్ర ఇక్కట్లకు గురయ్యారు. రైల్వే అధికారులు రిజర్వేషన్ టికెట్లను వాపసు తీసుకొని డబ్బు చెల్లించారు. ఇదిలా ఉండగా రైళ్ల వివరాలను ఎప్పటికప్పుడు ముందస్తుగా రైల్వే పోర్టల్‌లో తెలుసుకొని ప్రయాణానికి సిద్ధం కావాలని అధికారులు సూచిస్తున్నారు.



దానాపూర్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్

దారి మళ్లించిన సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్ల వివరాలు..

- సికింద్రాబాద్–దానాపూర్ ఇరువైపుల (దానాపూర్ ఎక్స్‌ప్రెస్ రైలు నెం.12791–92)
- విశాఖపట్టణం–న్యూఢిల్లీ ఇరువైపుల (ఏపీ ఎక్స్‌ప్రెస్, రైలు నెం.20805–06)
- బెంగళూరు–దానాపూర్ (సంఘమిత్ర ఎక్స్‌ప్రెస్ రైలు నెం.12295)
- మధురై–బికనీర్ (అనువ్రత్ ఎక్స్‌ప్రెస్ రైలు నెం .22631)
- మన్నార్‌గుడి–భగత్‌కీకోటి (మన్నార్‌గుడి ఎక్స్‌ప్రెస్ రైలు నెం.22674)
- ఇండోర్–కొచ్చివెళ్లి (అహల్యనగరి ఎక్స్‌ప్రెస్ రైలు నెం.22645)
- యశ్వంతపూర్–గోరఖ్‌పూర్ (యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్ రైలు నెం.12592)
- గోరఖ్‌పూర్–కొచ్చివెళ్లి (రప్తిసాగర్ ఎక్స్‌ప్రెస్ రైలు నెం.12511)
- మైసూర్–దర్భాంగా (భాగ్‌మతి ఎక్స్‌ప్రెస్ రైలు నెం.12578)
- చండీఘర్–మధురై (మధురై ఎక్స్‌ప్రెస్ రైలు నెం .12688)

పూర్తిగా రద్దయిన రైళ్లు

- చెన్నై సెంట్రల్– లక్నో– రైలు నెం.16093 (లక్నో ఎక్స్‌ప్రెస్) ఈనెల 22న రద్దు
- పూణే–కాజీపేట– రైలు నెం.22151 (పూణే ఎక్స్‌ప్రెస్) ఈనెల 23న రద్దు
- పాటలీపుత్ర–బెంగళూరు– రైలు నెం.22351 (బెంగళూర్ ఎక్స్‌ప్రెస్) ఈనెల 22న రద్దు
- లక్నో–చెన్నై – రైలు నెం.16094 (చెన్నై సెంట్రల్ ఎక్స్‌ప్రెస్) ఈ నెల 25న రద్దు
- కాజీపేట–పూణే– రైలు నెం.22152 (పూణే ఎక్స్‌ప్రెస్) ఈనెల 24న రద్దు
- బెంగళూరు–పాటలీపుత్ర– రైలు నెం.22352 (పాటలీపుత్ర ఎక్స్‌ప్రెస్) ఈనెల 25న రద్దు

కాలేజీ స్థలంలో గ్రంథాలయ నిర్మాణమేంటి..?



కాలేజీ ఎదుట బైఠాయించిన విద్యార్థులు, నాయకులు



విద్యార్థి నాయకులను అరెస్టు చేస్తున్న పోలీసులు

- మంత్రి కార్యక్రమాన్ని అడ్డుకునేందుకు విద్యార్థుల యత్నం
- విద్యార్థి నాయకునికి గాయాలు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల భవనాన్ని కూల్చి జిల్లా గ్రంథాలయాన్ని నిర్మిస్తే తమ సంగతేంటని విద్యార్థినులు ఆందోళనకు దిగారు. జిల్లా గ్రంథాలయ భవన నిర్మాణ పనులు ప్రారంభించేందుకు సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ రాగానే, ఆయన కార్యక్రమాన్ని అడ్డుకునేందుకు ఎస్‌ఎఫ్‌ఐ నాయకుల ఆధ్వర్యంలో విద్యార్థినులు దూసుకొచ్చారు. ఏసీపీ మహేశ్, సీఐ అనిల్, ఎస్సై మహేందర్ ఆధ్వర్యంలో అప్రమత్తమైన సిబ్బంది వారిని అడ్డుకున్నారు. ఈ క్రమంలో జరిగిన తోపులాటలో నాయకుడు ప్రశాంత్‌కు స్వల్పగాయాలయ్యాయి.

ఇంటర్ నోడల్ అధికారి ఆఫీసు ఎదుట బైఠాయింపు..

శిథిలావస్థకు చేరిన ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజీ స్థలంలో తిరిగి కొత్త కాలేజీ నిర్మించాలంటూ ఇంటర్‌నోడల్ అధికారి కార్యాలయం ఎదుట విద్యార్థులు నిరసన తెలిపారు. పేద కుటుంబాలకు చెందిన బాలికలు ఉన్నత విద్యను చదువుకోవద్దా.. ఇదేనా పాలకుల తీరు అంటూ విద్యార్థి సంఘ నాయకులు బాలసాని లెనిన్, సీపెల్లి రవీందర్, కల్లెపల్లి అశోక్ ప్రశ్నించారు. కాలేజీ స్థలాన్ని గ్రంథాలయానికి ఎలా కేటాయించారో చెప్పాలని డిమాండ్ చేశారు. గ్రంథాలయ భవనాన్ని మరో చోట నిర్మించుకోవాలన్నారు. నాయకులు శ్రీకాంత్, ఆజాద్, స్టాలిన్, నవీన్, రాకేశ్ తదితరులున్నారు. మంత్రి కార్యక్రమాన్ని అడ్డుకునేందుకు యత్నించిన నాయకులను ముందస్తుగా అదుపులోకి తీసుకున్నామని ఎస్సై తెలిపారు.

అందుబాటులోకి డిజిటల్ లైబ్రరీలు



గ్రంథాలయ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి ఈశ్వర్ తదితరులు

పెద్దపల్లిరూరల్: పోటీ పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించేలా గ్రంథాలయాలను డిజిటలైజేషన్ చేస్తామని సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. పెద్దపల్లిలో రూ.కోటి వ్యయ అంచనాలతో నిర్మించతలపెట్టిన గ్రంథాలయభవన నిర్మాణ పనులను గురువారం ప్రారంభించారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీ ఆవరణలో గ్రంథాలయ చైర్మన్ రఘువీర్‌సింగ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ పుట్ట మధుకర్, కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి, పంచాయతీ రాజ్ ఈఈ గిరీశ్‌బాబు, డీఈఈ శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

వర్గీకరణ బిల్లు కోసం యుద్ధానికి సిద్ధం

కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): ఎస్సీ వర్గీకరణ బిల్లు సాధనకు కేంద్ర ప్రభుత్వంపై యుద్ధానికి సిద్ధంగా ఉండాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు అంబాల రాజేందర్ మాదిగ పిలుపునిచ్చారు. పార్లమెంట్‌లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని డిమాండ్ చేస్తూ కాల్వశ్రీరాంపూర్ అంబేద్కర్ చౌరస్తాలో గురువారం రాస్తారోకో చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ నేతృత్వంలో ఎస్సీ వర్గీకరణ బిల్లు కోసం ఆందోళనలు, రాస్తారోకో వంటి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. పార్లమెంట్ ప్రత్యేక సమావేశంలో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టకుంటే రానున్న ఎన్నికల్లో మాదిగ సామాజికవర్గం ఆగ్రహానికి గురికాక తప్పదన్నారు.



రాస్తారోకో చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జి దాసరి కిషన్, నాయకులు పాల రాజేశం, మారుపాక మొండయ్య, మానస, విద్యార్థి నాయకులు శంకర్, రజిత, ఆరాధ్య, స్వర్ణ, మల్లికార్జున్, సుజాత, లత, రాజు, లికిత, అఖిల, వైష్ణవి, దివ్య, సుమన్, అంకిత, సురేశ్, రమ్య తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడిగా శ్యాంసుందర్



ఉత్తర్వులు అందజేస్తున్న మక్కాన్‌సింగ్

సుల్తానాబాద్(పెద్దపల్లి): సుల్తానాబాద్ పట్టణానికి చెందిన న్యాతరి శ్యాంసుందర్‌ను కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడిగా నియమించినట్లు పార్టీ జిల్లా అధ్యక్షుడు మక్కాన్‌సింగ్ తెలిపారు. రాష్ట్ర ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఎస్ ప్రీతం ఆదేశాల మేరకు గురువారం ఉత్తర్వులు అందజేశారు. ఈసందర్భంగా శ్యాంసుందర్ మాట్లాడుతూ, తన నియామకానికి సహకరించిన ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు, పార్టీ జిల్లా అధ్యక్షుడు మక్కాన్‌సింగ్, మాజీ ఎమ్మెల్యే విజయరమణారావుకు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లావ్యాప్తంగా ఉన్న దళితులను కాంగ్రెస్ పార్టీ వైపు నడిపించేందుకు తనవంతు ప్రయత్నం చేస్తానని పేర్కొన్నారు.


జూనియర్ సివిల్ జడ్జిల నియామకం

కరీంనగర్‌క్రైం: ఇటీవల నూతనంగా నియామకమైన 39 మంది జూనియర్ సివిల్ జడ్జిలను రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న కోర్టుల్లో నియమిస్తూ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. నియామకాల్లో భాగంగా ఉమ్మడి జిల్లాల్లోని 9 కోర్టులకు వీరిని కేటాయించింది. నంది మేడారం జూనియర్ సివిల్ జడ్జిగా నల్లాల వెంకట సచిన్‌రెడ్డి, హుజురాబాద్ ఫస్ట్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జిగా పద్మశాయిశ్రీ, కోరుట్ల జూనియర్ సివిల్ జడ్జిగా కాసుల్ల పావని, రాజన్న సిరిసిల్ల అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జిగా కావేటి సజన, కరీంనగర్ స్పెషల్ ఎక్సైజ్ కోర్టు మేజిస్ట్రేట్‌గా బానోత్ రాజేశ్వర్, కరీంనగర్ ఫస్ట్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జిగా దామెర్ల ప్రీతిలను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. హుజురాబాద్ ఫస్ట్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జిగా ఉన్న పాలడుగు అలేఖ్యను అక్కడే ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిగా బదిలీ చేశారు. సిరిసిల్ల ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి హిమబిందు ముదావత్‌ను రంగారెడ్డి మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టుకు బదిలీ చేయగా, ఈస్థానంలో నాగర్ కర్నూల్ ఫస్ట్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి ప్రవీణ్ అరవను నియమించారు. వీరంతా అక్టోబర్ 4వ తేదీలోపు జాయిన్ కావాలని ఉత్తర్వుల్లో సూచించారు.

జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక

పాలకుర్తి(రామగుండం): మండలంలోని జీడీనగర్‌లో గల యూనివర్సల్ ఇంగ్లిష్ మీడియం పాఠశాలకు చెందిన 10 మంది విద్యార్థులు వివిధ విభాగాల్లో జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఇటీవల ఎన్టీపీసీ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన స్కూల్‌గేమ్స్ ఆఫ్ ఫెడరేషన్‌లో జోనల్ స్థాయి కబడ్డీ పోటీల్లో కావ్యశ్రీ, అక్షయరాణి, శిరీష, అజయ్, సాయి అక్షయ్, రన్నింగ్‌లో అభిరామ్, లాంగ్‌జంప్లో విక్రమ్‌బాగ్, ఖోఖోలో శ్రీలేఖ, రంజిత్, వాలీబాల్‌లో రవి ప్రతిభ కనబరిచి జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం అఫ్జల్ తెలిపారు. ఈసందర్భంగా గురువారం పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులను కరస్పాండెంట్ ఇస్మాయిల్, ఉపాధ్యాయులు అభినందించారు.

మెడికల్ కాలేజీకి పార్థివదేహం



బాపయ్య(ఫైల్)

కోల్‌సిటీ(రామగుండం): మంథనికి చెందిన మద్దుకూరు బాపయ్య(91) మరణంలోనూ మహోపకారిగా నిలిచారు. నేత్రాలను దానం చేసి ఇద్దరికి చూపునివ్వడమే కాకుండా, తన పార్థివదేహాన్ని మెడికల్ కాలేజీకి దానం చేశారు. మంథని మున్సిపల్ పరిధి చైతన్యపురి కాలనీకి చెందిన మద్దుకూరు బాపయ్య అనారోగ్యంతో బుధవారం మృతిచెందాడు. ఆయన భార్య కనకదుర్గాబాయి అంగీకారంతో సదాశయ ఫౌండేషన్, కమాన్‌పూర్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి గోదావరిఖనిలోని సింగరేణి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(సిమ్స్) మెడికల్ కాలేజీకి బాపయ్య పార్థివదేహాన్ని కుటుంబ సభ్యులు అప్పగించారు. ఆయన నేత్రాలను హైదరాబాద్‌లోని వాసన్ ఐ బ్యాంక్‌కు దానం చేశారు. బాపయ్య భార్యతోపాటు కొడుకులు, కోడళ్లు రఘుబాబు, రాధ, సతీష్‌బాబు, ఝాన్సీ పలువురికి స్ఫూర్తిగా నిలిచారని జెడ్పీ చైర్మన్ పుట్ట మధుకర్, మున్సిపల్ చైర్మన్ పుట్ట శైలజ, మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ హిమబిందు సింగ్, సదాశయ వ్యవస్థాపక అధ్యక్షుడు టి.శ్రావణ్ కుమార్ కొనియాడారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడిగా ప్రీతం



ప్రీతం

గోదావరిఖనిటౌన్(రామగుండం): అఖిల భారత విద్యార్థి సమాఖ్య జిల్లా అధ్యక్షుడిగా రేణికుంట్ల ప్రీతం, ప్రధాన కార్యదర్శిగా బాలసాని లెనిన్‌ను ఎన్నుకున్నట్లు రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి తెలిపారు. ఏఐఎస్‌ఎఫ్ నిర్మాణ మహాసభలలో భాగంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా ఉపాధ్యక్షులుగా కల్వల శ్రీకాంత్, లెనిన్, సహాయ కార్యదర్శి మొలుగూరి నితిలేష్, కోశాధికారి సాయి ఆజాద్‌లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి సదానందం తదితరులు ఉన్నారు.

అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో నియామకం సరికాదు



వినతిపత్రం స్వీకరిస్తున్న సత్తయ్య

గోదావరిఖని(రామగుండం): క్లరికల్ సిబ్బందిని అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో తీసుకునే విధానం వెంటనే రద్దు చేయాలని బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య డిమాండ్ చేశారు. గురువారం క్లరికల్ సిబ్బంది అందజేసిన వినతి పత్రాన్ని స్వీకరించి మాట్లాడారు. సంస్థలో పనిచేస్తున్న అర్హులైన అంతర్గత ఉద్యోగుల నుంచి తీసుకోవాలన్నారు. లేకుంటే సింగరేణి వ్యాప్తంగా నిరసనలు చేపడుతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు వై.సారంగపాణి, ఆకుల హరిణ్, సాయవేణి సతీశ్, పెంచాల వెంకటస్వామి, తాట్ల లక్ష్మయ్య పాల్గొన్నారు.

బీసీ మహిళలకు సబ్ కోటా కేటాయించాలి

సుల్తానాబాద్(పెద్దపల్లి): మహిళా బిల్లులో బీసీ మహిళలకు సబ్ కోటా కేటాయించాలని బీసీ యువజన సంఘం రాష్ట్ర కన్వీనర్ తంగెళ్లపల్లి రాజ్‌కుమార్ అన్నారు. ఢిల్లీలో జంతర్‌మంతర్ వద్ద నిర్వహించిన ధర్నాకు జిల్లా నుంచి పలువురు నాయకులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మహిళా బిల్లులో బీసీ మహిళలకు సబ్ కోటా కల్పించినప్పుడే సమాజంలో సామాజిక న్యాయం లభిస్తుందన్నారు. మహిళలకు ప్రాతినిధ్యం కల్పించకపోతే మహిళ బిల్లుకు సార్థకత లేదన్నారు. రాజకీయ రిజర్వేషన్లతో పాటు విద్య, ఉద్యోగాల్లో కూడా 50 శాతం రిజర్వేషన్లు ప్రవేశపెట్టాలని కోరారు.

దివ్యాంగులకు ఉపకరణాల అందజేత

పెద్దపల్లిరూరల్: ప్రమాదవశాత్తు కాళ్లు పోగొట్టుకుని నడవలేని స్థితిలో ఉన్న అభాగ్యులకు నల్ల ఫౌండేషన్ వ్యవస్థాపకుడు నల్ల మనోహర్‌రెడ్డి అండగా నిలిచి గురువారం కృత్రిమ కాళ్లను అందించారు. పెద్దపల్లి మండలం బోంపల్లి గ్రామానికి చెందిన అరికిళ్ల రాయమల్లు, భోజన్నపేట గ్రామానికి చెందిన బత్తుల కొమురయ్యకు కృత్రిమ కాళ్లు అందజేశారు. మనోహర్‌రెడ్డికి రుణపడి ఉంటామని రాయమల్లు, కొమురయ్య పేర్కొన్నారు.

బొగ్గుబాయి వార్తలు

11వ వేజ్‌బోర్డు ఏరియర్స్ చెక్కులు అందజేత



చెక్కులు అందజేస్తున్న జీఎం శ్రీనివాస్



చెక్కులు అందజేస్తున్న ఆర్జీ–3, ఏపీఏ జీఎంలు

రామగిరి(మంథని): సింగరేణి కార్మికులకు 23 నెలలుగా పెండింగ్‌లో ఉన్న ఏరియర్స్ చెక్కులను గురువారం ఆర్జీ–3, ఏపీఏ జీఎంలు సుధాకర్‌రావు, వెంకటేశ్వర్లు అందజేశారు. ఆర్జీ–3 ఏపీఏ, ఓసీపీ–1,2లలో 11వ వేజ్‌బోర్డుకు సంబంధించి అత్యధిక ఏరియర్స్ పొందిన ఉద్యోగులు లక్ష్మీనారాయణ, మల్లారెడ్డి, మనోహర్‌వర్మ, మహేందర్‌రెడ్డి, తిరుపతిరావు, తిరుపతిలకు చెక్కులను అందజేశారు. కార్మికులకు ఒకే దఫా ఏరియర్స్ చెల్లించడం జరిగిందని, డబ్బులు జాగ్రతగా వినియోగించుకోవాన్నారు. అధికారులు సీతారామం, రఘుపతి, డీ.బైద్య, పి.శ్రీనివాసులు, రవీందర్‌రెడ్డి, యూనియన్‌ల ప్రతినిధులు గౌతం శంకరయ్య, ఎంఆర్సీ రెడ్డి, రియాజ్ అహ్మద్, తిరుపతి, వేణుగోపాల్ పాల్గొన్నారు.

ఆర్జీ–1లో..

గోదావరిఖని(రామగుండం): 11వ వేజ్‌బోర్డు ఏరియర్స్ చెక్కులను ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్ గురువారం అందజేశారు. జీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 23నెలల బకాయిలు అత్యధికంగా అందుకున్న ముగ్గురు ఉద్యోగులకు చెక్కులు పంపిణీ చేశారు. అత్యధిక ఏరియర్స్ అందుకున్న జీడీకే–11హెడ్ ఓవర్‌మెన్ వేముల సుదర్శన్‌రెడ్డికి రూ.6.27లక్షలు, జీడీకే–2 ఫోర్‌మెన్ డి.సుధాకర్‌కు రూ.6,24 లక్షలు, కన్వేయర్ ఆపరేటర్ వెన్నం రాజిరెడ్డికి రూ.5.25లక్షలు, జీడీకే–11 ఎలక్ట్రికల్ ఫోర్‌మెన్ ఎం.ఆంజనేయులు రూ.5.21లక్షలు అందజేశారు. కార్యక్రమంలో అధికారులు రామ్మోహన్, లక్ష్మీనారాయణ, శ్రావణ్‌కుమార్, నాయకులు గండ్ర దామోదర్‌రావు, ఆరెల్లి పోశం, ఎండీ ఖయ్యూం, కె.సదానందం, మెండె శ్రీనివాస్, ఆకుల హరిణ్, ఏరియా ఇంజినీర్ రామ్మూర్తి, సీనియర్ పీఓ సారంగపాణి పాల్గొన్నారు.

ఆర్జీ–2లో..

ఏరియాలో అత్యధిక ఏరియర్స్ పొందిన ఉద్యోగులకు గురువారం ఆర్జీ–2 జీఎం ఎల్‌వీ సూర్యనారాయణ చెక్కులు అందజేశారు. మీర్జా ఉస్మాన్‌బేగ్, మల్లేపల్లి నగేశ్, జార్తి కనకయ్యకు చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అధికారులు అబ్దుల్‌సలీం, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు. అలాగే ఆర్జీ–3 ఓసీపీ–1లో జీఎం సుధాకర్‌రావు ఏరియర్స్ చెక్కులు అందజేశారు. టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి మిర్యాల రాజిరెడ్డి, అధికారులు రాధాక్రిష్ణ, ఉదయ్‌హరిజన్, కావూరి మారుతి తదితరులు పాల్గొన్నారు.

మైన్స్ సేఫ్టీ సమావేశాల్లో అవకాశం కల్పించండి

గోదావరిఖని(రామగుండం): సింగరేణిలో గుర్తింపు సంఘం కాలపరిమితి ముగిసిన క్రమంలో మైన్స్ సేఫ్టీ సమావేశాల్లో అన్ని కార్మిక సంఘాలకు అవకాశం కల్పించాలని జాతీయ కార్మిక సంఘాల నాయకులు కోరారు. జీడీకే–5 ఓసీపీ ఆవరణలో జాతీయ కార్మిక సంఘాల నాయకులు గురువారం ప్రాజెక్టు మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ, గుర్తింపు సంఘం కాలపరిమితి ముగిసి నాలుగేళ్లు గడిచినందున ఎన్నికలు జరిగే వరకు అన్ని సంఘాలను సమానంగా పరిగణిస్తూ ఇకముందు జరిగే మైన్స్ కమిటీ, సేఫ్టీ కమిటీల్లో అన్ని సంఘాలను ఆహ్వానించాలన్నారు. లేకుంటే ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో జాతీయ కార్మిక సంఘాల పిట్ కార్యదర్శులు గుర్రం ప్రభుదాస్, పల్లె శ్రీనివాస్, ఆర్‌డీ చారి, గౌర్ బేగ్, కోటేశ్, ఆకుల హరిణ్, మాదన మహేశ్, పల్లెర్ల శ్రీనివాస్‌రెడ్డి, పోరండ్ల వెంకటేశం, భోగ సతీశ్‌బాబు, సాగర్, సల్పాజీ మనోహర్‌రావు, జనగామ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

జీఎంను కలిసిన గణపతి నిమజ్జన కమిటీ

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): యైటింక్లయిన్ కాలనీ గణపతి నిమజ్జన నిర్వహణ కమిటీ సభ్యులు గురువారం ఆర్జీ–2 జీఎం ఎల్‌వీ సూర్యనారాయణను కలిశారు. నవరాత్రుల సందర్భంగా గణేశ్ నిమజ్జన నిర్వహణ వివరాలు తెలుసుకున్నారు. ప్రశాంతంగా నిమజ్జనం జరిగేలా చూడాలని జీఎం సూచించారు. అనంతరం జీఎంను కమిటీ సభ్యులు సన్మానించారు. అలాగే స్థానిక సీఈఆర్ క్లబ్ సభ్యులు జీఎంను కలిసి సన్మానించారు. సభ్యులు దావు రాజిరెడ్డి, జగన్నాథచార్యులు, బాలయ్య, రాజమౌళి, ఐలి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



జీఎంతో గణపతి నిర్వహణ కమిటీ సభ్యులు

కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

గోదావరిఖని(రామగుండం): సింగరేణి కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గురువారం ఆర్జీ–1 జీఎం ఆఫీస్ ఎదుట ఏఐటీయూసీ నాయకులు ధర్నా చేపట్టారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ, సంస్థలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులు చాలీచాలని వేతనాలతో ఇబ్బంది పడుతున్నారన్నారు. గత ఏడాది 18రోజులు సమ్మె నిర్వహించి పలుసార్లు జరిగిన చర్చల వల్ల సెప్టెంబర్ 26న కేంద్ర కార్మికశాఖ వద్ద యాజమాన్యం, యూనియన్ లతో ఒప్పందం జరిగిందన్నారు. ఆ ఒప్పందాన్ని ఇప్పటివరకు అమలు చేయలేదని పేర్కొన్నారు. ఒప్పందం అమలుచేయాలని, లేకుంటే ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఈ నెల 25న చలో కొత్తగూడెం పిలుపునిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు మడ్డి ఎల్లాగౌడ్, కె.స్వామి, ఆరెల్లి పోషం, రంగు శ్రీనివాస్, బుర్ర తిరుపతి, ఎంఏ గౌస్, శనిగల శ్రీనివాస్, ఎస్.వెంకట్‌రెడ్డి, మద్దెల దినేశ్, ఎం.చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

క్లరికల్ సిబ్బంది కాంట్రాక్టీకరణ విరమించుకోవాలి

గోదావరిఖని(రామగుండం): క్లరికల్ సిబ్బంది కాంట్రాక్టీకరణ వెంటనే విరమించుకోవాలని ఏఐటీయూసీ నాయకులు కోరారు. గురువారం జీడీకే–5 ఓసీపీ ప్రాజెక్టు అధికారి చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ, హైదరాబాద్ సింగరేణి భవన్‌లో ఫైనాన్స్, పర్చేస్, మార్కెటింగ్ శాఖలో నలుగురు హైస్కిల్డ్ అభ్యర్థులు కావాలని నిట్ ద్వారా టెండర్లు పిలిచి డ్రా పద్ధతిన నియామకాలు జరపడం కాంట్రాక్టీకరణ, ప్రైవేటీకరణకు పెద్ద పీటవేయడమేనన్నారు. ఈమేరకు నల్లబ్యాడ్జీల ద్వారా నిరసన తెలిపారు. నాయకులు కె.స్వామి, ఆరెల్లి పోషం, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఓసీపీ సర్ఫేస్ డిపార్ట్‌మెంట్‌కు బదిలీ చేయాలి

రామగిరి(మంథని): ఆర్జీ–3 డివిజన్ పరిధి 10వ గనిలో విధులు నిర్వహిస్తున్న కార్మికులను రిడిప్లాయిమెంట్ చేస్తూ ఓసీపీ సర్ఫేస్‌కు బదిలీ చేయాలని గురువారం ఏపీఏ జీఎం వెంకటేశ్వర్లుకు టీబీజీకేఎస్ డివిజన్ ఉపాధ్యక్షుడు గౌతం శంకరయ్య, కార్మికులు వినతిపత్రం అందజేశారు. గని పూర్తిగా మూసివేస్తున్న సందర్భంగా ప్రస్తుతం 39 మంది కార్మికులు మాత్రమే మిగిలి ఉన్నారని, ఇందులో 16 మంది కార్మికులు సర్ఫేస్ వెళ్లడానికి అంగీకారం తెలుపుతున్నారని పేర్కొన్నారు.

కోర్టు ప్రాంగణంలో ఉచిత వైద్య శిబిరం

గోదావరిఖనిటౌన్(రామగుండం): గోదావరిఖని జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ప్రాంగణంలో గురువారం సింగరేణి కంపెనీ ఆధ్వర్యంలో ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్ ఆదేశాల మేరకు న్యాయవాదులు, వారి కుటుంబ సభ్యులకు, కోర్టు సిబ్బందికి ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. అదనపు జిల్లా జడ్జి శ్రీనివాసరావు శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. న్యాయమూర్తులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బందిని దృష్టిలో పెట్టుకొని సింగరేణి ఈ కార్యక్రమాన్ని చేపట్టడం అభినందనీయం అన్నారు. మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి దుర్గం గణేష్, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.